నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, బుధవారం 8 జనవరి 2025 YADADRI BHUVANAGIRI


## పీఈఎల్ ప్రమాద బాధితుడికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

యాదగిరిగుట్ట, జనవరి7: ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో గత శనివారం జరిగిన పేలుడులో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు మొగిలిపాక ప్రకాశ్‌ను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. వైద్యులు కమలేశ్, శ్రీనివాస్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రకాశ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట రామాజీపేట మాజీ సర్పంచ్ మొగిలిపాక రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. మొగిలిపాక ప్రకాశ్‌ను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ కూడా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆక్షాంచి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత

## విద్యార్థులు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత

భువనగిరి అర్బన్, జనవరి 7: విద్యార్థులు చదువుతోపాటు హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాల బాలికల కోసం ఏర్పాటు చేసిన జాతీయ న్యాయసేవ పథకం అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల్లోనూ తరుచూ హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీ ఏమాయె?



## చేనేత దినోత్సవాన స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

'చేనేత వృత్తిపై ఆధారపడిన నేతన్నలకు కాంగ్రెస్ సర్కారు అండగా ఉంటుంది. నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటాం. రైతు రుణ మాఫీ తరహాలోనే నేతన్నలకు కూడా మాఫీ చేస్తాం. రుణమాఫీకి ఇప్పుడే ఆదేశాలు ఇస్తున్నాం' గతేడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఇది.

**నాలుగు నెలలు దాటినా కనీసం పట్టించుకోని వైనం**

- జిల్లాలో రూ.35 కోట్ల వరకు రుణాల పెండింగ్
- మాఫీ మార్గదర్శకాలపైనా స్పష్టత కరువు
- ఆశగా ఎదురుచూస్తున్న నేత కార్మికులు
- కేసీఆర్ సర్కారులో రూ.7కోట్లు మాఫీ

**చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడం లేదు. వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్ద పరిశ్రమ అయిన చేనేతను సర్కారు గాలికి వదిలేసింది. గతంలో సమర్థవంతంగా అమలైన పథకాలను ఆపేసి నేతన్నల కుటుంబాలను ఆగమాగం చేస్తున్నది. చేనేత రుణాలు మాఫీ చేస్తామని గప్పాలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఆ తర్వాత పట్టించుకోవడమే మానేశారు. ఇప్పటి వరకు మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదంటేనే నేతన్నలపై సర్కారు చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, జనవరి 7 (నమస్తే తెలంగాణ)

### రూ.35 కోట్ల రుణాలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. సుమారు 20,000 మంది చేనేత కార్మికులు ఉంటారు. పోచంపల్లి, గట్టుప్పల్, పుట్టపాక, సంస్థాన్‌నారాయణపురం, భువనగిరి, కొయ్యలగూడెం, చండూరు, మునుగోడు తదితర ప్రాంతాల నుంచి చీరలు అధికంగా ఉత్పత్తి చేస్తా2రు. జిల్లాలో 43 సొసైటీలు ఉండగా, వేలాది మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని కార్మికులు, సొసైటీలు కలిపి రూ.35.25 కోట్ల రుణాలు తీసుకున్నారు. 43 సొసైటీల్లోని 11 వాటిల్లో 52.5 కోట్లు రుణాలు తీసుకున్నాయి. 1162 మంది కార్మికులు లక్షలోపు రూ.6 కోట్లు, లక్షకు పైగా 1537 మంది 24 కోట్లు లోన్ తీసుకున్నారు. మొత్తంగా 2,689 మంది కార్మికులు 30 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు.

### మార్గదర్శకాలు కరువు

సీఎం రేవంత్ రెడ్డి చేనేత రుణమాఫీపై ప్రకటన చేసినప్పటికీ అమలుకు సంబంధించి ఎలాంటి ముందడుగూ పడలేదు. రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల కాలేదు. చేనేత శాఖ అడిగిన సమాచారంలో సంఘాల వివరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత రుణాల వివరాలు కోరలేదు. అసలు ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు కటాఫ్‌గా తీసుకుంటారనేది క్లారిటీ లేదు. మాఫీకి అర్హులు ఎవరు, ఎంత వరకు మాఫీ చేస్తారు అనేది తేలాల్సి ఉంది. నాడు రుణమాఫీలో రేవంత్ రెడ్డి మరమగ్గాలను ప్రస్తావించకపోవడం గందరగోళానికి దారితీసింది. ఇప్పటికే కొంతమంది కార్మికులు రుణాలు తిరిగి చెల్లించారు. వారికి మాఫీ అవుతుందా, లేదా అనే దానిపై స్పష్టత లేదు.

### కేసీఆర్ సర్కారులో రుణమాఫీ

బీఆర్‌ఎస్ హయాంలో రైతు రుణమాఫీ తరహాలో చేనేత రుణమాఫీకి కూడా చేసింది. 2010 నుంచి 2017 మార్చి వరకు తీసుకున్న వ్యక్తిగత రుణాలను అప్పటి ప్రభుత్వం మాఫీ చేసింది. జిల్లా సహకార బ్యాంకు నుంచి, జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించింది. అలా జిల్లాలో 1,014 మంది చేనేత కార్మికులకు సుమారు రూ. 7కోట్ల లబ్ధి చేకూరింది. నాడు జిల్లాలోని 10 చేనేత సహకార సంఘాలకు నాబార్డ్ ద్వారా లోన్ రీ ఫైనాన్స్ కింద డీసీసీబీ నల్లగొండ నుంచి 4.52కోట్ల రుణ పరపతి మంజూరైంది. అదే విధంగా పావలా వడ్డీ పథకం కింద చేనేత సహకార సంఘాలకు 1.53 కోట్లు మంజూరు చేయడం గమనార్హం.

**నాలుగు నెలలైనా ఊసేది?**

భూదాన్‌పోచంపల్లికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ మంజూరైంది. గతేడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘాల నాయకులు సీఎంను కలిసి రుణమాఫీపై విజ్ఞప్తి చేయగా, రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి అక్కడే ప్రకటించారు. దాంతో నేతన్నల్లో ఆశలు చిగురించాయి. జిల్లా నుంచి చేనేత జౌళి శాఖ అధికారులు ప్రతిపాదనలు కూడా పంపారు. నాలుగు నెలలైనా ఇప్పటి వరకు దీనిపై ఉలుకూపలుకూ లేదు.

### చేనేత రుణమాఫీ చేయాలి



చేనేత కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలి. మాఫీ కోసం కార్మికులంతా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి మాఫీ చేయడంతోపాటు కొత్త రుణాలు ఇప్పించాలి. కార్మికుల సంక్షేమం కోసం చేనేత పొదుపు పథకాన్ని పునరుద్ధరించాలి. చేనేత కార్మికులందరికీ పని కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. **-చిక్క కృష్ణ, చేనేత నాయకుడు, భూదాన్‌పోచంపల్లి**

### రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నాం



చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ అమలు చేయలేదు. పొదుపు చేసుకున్న డబ్బులను కూడా లోన్ ఉందని బ్యాంకుల్లో పట్టుకున్నరు. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న కార్మికులను ఆదుకోవాలి. **-జల్ల వైకుంఠం, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి**



మునుగోడులో పత్తి మిల్లు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

## పత్తి కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

మునుగోడు, జనవరి 7 : సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. మునుగోడు మండల కేంద్రంలోని సలాసర్ బాలీజీ కాటన్ మిల్లులో సీసీఐ ఏర్పాటు చేయగా, నాణ్యత లేమి, తేమ శాతం పేరు తోకొర్రీలు పెడుతూ మిల్లు యాజమాన్యం కొనుగోలుకు నిరాకరించింది. దాంతతో రైతులు మంగళవారం మిల్లు ఎదుట ధర్నా చేశారు. మిల్లు యాజమాన్యం కావాలని తమను ఇబ్బందుల పాలు చేస్తున్నదని, సీసీఐ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాసీల్దార్‌నరేందర్, ఎస్‌ఐ రవి అక్కడిక చేరుకుని మిల్లు యాజమాన్యతో మాట్లాడి కొనుగోళ్లకు ఒప్పించడంతో రైతులు ఆందోళన విరమించారు.

## చైనా మాంజా వాడితే చర్యలు

- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, జనవరి 7: సంక్రాంతి సందర్భంగా పతంగులకు చైనా మాంజా వాడడాన్ని జిల్లాలో నిషేధించామని, దానిని వాడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్రపవార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా చిన్న పిల్లలు సరదాగా ఎగరేసే పతంగులకు నైలాన్, సింథటిక్‌తో తయారు చేసిన చైనా మాంజా వాడటం వల్ల మనుషులు, పక్షులు, జంతువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

చైనా మాంజా వాడి పడేస్తే అవి చెట్లకు, ఎలక్ట్రిక్ వైర్లకు తగిలి వేలాడుతూ ఉంటాయని, దాని వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. చైనా మాంజాను విక్రయించవద్దని, ఒకవేళ పాత స్టాక్ ఉంటే దానిని వెంటనే తొలగించాలని సూచించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

## కేసీఆర్ సార్ ఇచ్చిన పింఛనే దిక్కు

- రేవంత్‌రెడ్డి మోసం చేసిండు
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో వృద్ధుల ఆవేదన



కోటమర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

అడ్డగూడూరు, జనవరి 7: నెలకు 4వేల రూపాయలు పింఛన్ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేసిండని వృద్ధ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి గ్రామంలో మాజీ జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతిఅయోధ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంగళవారం పరామర్శకు వెళ్తూ దారిలో వృద్ధులను చూసి ఆగారు. 'అవ్వా.. బాగున్నారా!' అని అప్యాయంగా పలుకరించారు. ఫించన్, రైతుబంధు వస్తున్నయా అని కిశోర్ కుమార్ అడగగా.. కేసీఆర్ సార్ ఇచ్చే రెండు వేల పెన్షనే మాకు దిక్కు అంటూ బదులిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక పింఛన్ పెంచలేదు. రైతు బంధు లేదు, బతుకమ్మ చీరెలు లేవని వాపోయారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఉద్దేశించి ఓ మహిళ నా బిడ్డ పెండ్లికి రెండు తులాల బంగారం ఇచ్చిండు అంటూ ఎద్దేవా చేయడంతో అక్కడున్న వారంతా నవ్వారు.



పనులను అడ్డుకొని ఆందోళన చేస్తున్న శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితులు

## పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తే శివన్నగూడెం ప్రాజెక్టుపై నిరవధిక దీక్ష

- పనులను అడ్డుకున్న చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు

మర్రిగూడ, జనవరి 7 : శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండలంలోని చర్లగూడెం, నర్సిగూడెం ముంపు బాధితులు మంగళవారం కట్ట నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ భూములకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండా మట్టిని ఎత్తితే తామేం పని చేసుకుని చేసి బతుకాలని ప్రశ్నించారు. పరిహారంతోపాటు ఇండ్ల స్థలాలు కేటాయించి పునరావాసం కల్పించాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామాల్లో 420 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని తెలిపారు. మరో 100 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదన్నారు. నష్టపరిహారం ఇవ్వకుండానే ఊరిని ఖాళీ చేయించాలనే ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. సర్కారు స్పందించకుండా మొండిగా వ్యవహరిస్తే ప్రాజెక్టు కట్టపైన నిరవధిక నిరహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

# రైతు భరోసా ₹15వేలు ఇవ్వాల్సిందే

## కాంగ్రెస్ మోసంపై బీఆర్‌ఎస్ ఆందోళనలు

- కోతల సర్కారుపై మండిపాటు
- రైతులతో కలిసి నిరసనలు
- పలు మండలాల్లో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు

**రైతు భరోసాలో కాంగ్రెస్ సర్కారు కోత పెట్టడంపై బీఆర్‌ఎస్ పార్టీ భగ్గుమంటున్నది. రైతుల పొట్ట కొట్టే నిర్ణయాన్ని ఖండిస్తూ రోడ్డెక్కింది. రేవంత్ రెడ్డి సర్కారు తీరును వ్యతిరేకిస్తూ రైతులతో కలిసి ఆందోళనలు చేస్తున్నది. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు ఎకరాకు రూ.15వేలు ఇవ్వాల్సిందేనని పట్టు పడుతున్నది. ఈ మేరకు నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో మంగళవారం రాస్తారోకోలు కొనసాగాయి. తుంగతుర్తి మండలం రామన్నగూడెంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆత్మకూర్.ఎస్‌లో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యాదగిరిగుట్టలో ర్యాలీ తీసి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు.**



యాదగిరిగుట్టలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బొమ్మలరామారంలో రాస్తారోకో



బొమ్మలరామారంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బొమ్మలరామారం, జనవరి 15 : రైతు భరోసాలో కోతలను ఖండిస్తూ బొమ్మలరామారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ మోసపూరిత ప్రకటనలు చేస్తున్న రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతాంగానికి క్షమాపణలు చెప్పాలన్నారు. ఏటా ఎకరాకు రైతు భరోసా రూ.15వేలు ఇవ్వకపోతే రైతుల నుంచి తీవ్ర పోరాటాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు మన్నె శ్రీధర్, బెజ్జంకి పాపిరెడ్డి, నాగరాజు, మహేందర్‌రెడ్డి, జంగయ్య, రాజు, శాంతాచారి పాల్గొన్నారు.

## కండ్లకు గంతలు కట్టుకుని నిరసన

తుంగతుర్తి, జనవరి 7 : ఎన్నికల హామీ మేరకు కాకుండా రైతు భరోసాలో కోత పెట్టడాన్ని నిరసిస్తూ తుంగతుర్తి మండలంలోని రామన్నగూడెంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు కండ్లకు గంతలు కట్టుకుని నిరసనకు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన చేస్తుందని మండిపడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని రేవంత్‌రెడ్డి సర్కారు రైతు భరోసా విషయంలోనూ మోసం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గుండగాని రాములుగౌడ్, గాజుల యాదగిరి, మాజీ ఎంపీటీసీ ఆంగోతు నరేశ్, రైతులు పాల్గొన్నారు.



రామన్నగూడెంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, రైతులు

## కోతలు.. కొర్రీలు దుర్మార్గం

- పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇచ్చే వరకు ఆందోళనలు
- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య
- యాదగిరిగుట్టలో ర్యాలీ, రాస్తారోకో

యాదగిరిగుట్ట, జనవరి7 : రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ఆందోళనలు తప్పవని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. రైతు భరోసా రూ.15వేలను భేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి వైకుంఠ ద్వారం వరకు, అక్కడి నుంచి పాతబస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రుణమాఫీలో కోతలు పెట్టి చేతులు దులిపేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతు భరోసాకు కొర్రీలు, కోతలు పెట్టడం దుర్మార్గమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చే స్థితిలో రేవంత్‌రెడ్డి సర్కారు లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లే మొహం లేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్ బూడిద సురేందర్, బీఆర్‌ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, ఆరె శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, కందాల రంగారెడ్డి, గాజుల శ్రీనివాస్, పేరబోయిన సత్యనారాయణ, కోన్యాల నర్సింహారెడ్డి, అంకం నర్సింహా, ముక్కర్ల సతీశ్‌యాదవ్, బీర్ల మహేశ్, గుణగంటి బాబురావు, భాస్కర్, రమేశ్, చంద్రం పాల్గొన్నారు.